క్లుప్తంగా

స్పందనలో 13 అర్జీలు

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 13 అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు.

లచ్చిగూడెంలో గ్రామసభ

కుక్కునూరు : మండలంలోని లచ్చిగూడెం గ్రామానికి సంబంధించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా పునరావాస కాలనీల కేటాయింపు విషయమై సోమవారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. 2017వ సంవత్సరంలో నమోదైన ఎస్ఈఎస్ డేటా ప్రకారం నిర్వాసితుల పేర్లను గ్రామసభలో అధికారులు చదివి వినిపించారు. లచ్చిగూడెం గ్రామానికి సంబంధించి 173 మంది గిరిజనులు, ఒక గిరిజనేతర కుటుంబాలుండగా గిరిజనులకు దాచారం పునరావాస కాలనీలో ఇళ్లు కేటాయించనున్నట్లు ఇప్పటికే 83 కుటుంబాలకు ఇళ్లు సిద్ధంగా ఉన్నట్లు తక్కిన వారికి కూడా నిర్మాణం జరుగుతున్నట్లు నిర్వాసితులకు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, వీఆర్ఓ షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి జగదాంబ అమ్మవారి ఆలయ హుండీని ఆలయ అధికారులు సోమవారం లెక్కించారు. జంగారెడ్డిగూడెం పారిజాతగిరి దేవస్థానం ఈవో ఎం.రాంబాబు పర్యవేక్షణలో హుండీ తెరిచి లెక్కించినట్లు జగదాంబ ఆలయ ఈవో ఎంఎస్ఎస్ శర్మ తెలిపారు. 2022 సెప్టెంబర్ 1 వ తేదీ నుంచి 2023 జూలై 10 వ తేది వరకు సుమారు 10 నెలల 9 రోజులలో భక్తులు హుండీలో వేసిన సొమ్ములను లెక్కించగా నోట్లు రూ. 2,96,510, చిల్లర కాయిన్లు రూ.31,445 వెరశి మొత్తం రూ. 3,27,955 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తాం



పార్టీ నాయకులను ఎంపీ మిథున్‌రెడ్డికి పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేసే ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని ఆ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి అన్నారు. రాజమండ్రిలోని షెల్టన్ హోటల్‌లో రాజమండ్రి పార్లమెంటరీ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథులుగా మిథున్‌రెడ్డి, మరో రీజనల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. ఆ కార్యక్రమానికి ద్వారకాతిరుమల మండలం నుంచి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ భాషా, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, బొండాడ వెంకన్నబాబు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మిథున్‌రెడ్డి పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.

నెలరోజుల్లో రోడ్డు సమస్య పరిష్కరిస్తామని హామీ

కుక్కునూరు: నెలరోజుల్లో రోడ్డు సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టనున్నట్టు రోడ్లు-భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా హామీ ఇచ్చినట్టు కుక్కునూరు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు పేర్కొన్నారు. సోమవారం రాజమండ్రిలో జరిగిన పార్టీ కార్యక్రమానికి వెళ్లిన కుక్కునూరు మండల నాయకులు మంత్రి దాడిశెట్టి రాజా, ఉభయగోదావరి జిల్లాల సమన్వయకర్త ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసి మండల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కుక్కునూరు-బూర్గంపాడు ఆర్అండ్‌బీ రహదారి మరమ్మతులు లేక కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని దుస్థితి నెలకొందని మంత్రికి వివరించారు. దీంతో స్పందించిన మంత్రి దాడిశెట్టి రాజా నెలరోజుల్లో రోడ్డు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

వలంటీర్లకు సన్మానం

కుకునూరు : తొండిపాక సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్‌లకు సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డి, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, గణపవరం ఉప సర్పంచ్ ఎల్లంకి లక్ష్మణరావు మాట్లాడుతూ వలంటీర్‌లపై కొంతమంది చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితం అన్నారు. కరోనా కష్టకాలం నుంచి నేటి వరకు ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో కీలక పాత్ర వలంటీర్లదేనని కొనియాడారు.

పెరిగిన హమాలీల కూలి రేట్లు

జంగారెడ్డిగూడెం : సిమెంట్, ఐరన్ హమాలీల కూలి రేట్లు పెరిగాయని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ తెలిపారు. జంగారెడ్డిగూడెం ఏరియా పరిధిలో సిమెంటు, ఐరన్, టైల్స్, వైట్ సిమెంట్ తదితర వాటిల్లో పనిచేసే హమాలీల అగ్రిమెంట్ కాలపరిమితి ముగియడంతో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ధరలు పెంచాలని యాజమాన్యం వారికి నోటీసులు ఇవ్వగా యాజమాన్యం స్పందించి సోమవారం జాయింట్ సమావేశం ఏర్పాటుచేశారన్నారు. ఇరువర్గాలు చర్చించి రేట్లు పెంచినట్లు రమణ తెలిపారు.

పవన్ వ్యాఖ్యలపై నిరసన సెగలు

- వలంటీర్లతో కలిసి వైఎస్సార్ సీపీ నిరసనలు
- పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం
- బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్



చింతలపూడి : పవన్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు



కొయ్యలగూడెం : పోలీస్ స్టేషన్లో పవన్ కళ్యాణ్‌పై ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



కామవరపుకోట : కొత్తూరు సచివాలయ ఆవరణలో చెప్పలు చూపించి నిరసన తెలుపుతున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది

చింతలపూడి : వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వలంటీర్లకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఏలూరులో పవన్‌కళ్యాణ్ వలంటీర్ల వ్యవస్థపై, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ఆధ్వర్యంలో స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు మానవహారంగా ఏర్పడి పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పవన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, యువతుల అదృశ్యంలో వలంటీర్ల పాత్ర ఉందంటూ పవన్ వ్యాఖ్యానించడం దారుణమన్నారు. కనీసం ఎమ్మెల్యే కూడా కాని వ్యక్తితో అంతర్గత భద్రత గురించి కేంద్ర నిఘా సంస్థ చర్చించారని చెప్పుకోవడం పవన్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అటువంటి పరిస్థితి ఉంటే ముఖ్యమంత్రితో కాని ,హోంమంత్రికి కాని సమాచారం ఇస్తారని అన్నారు. కనీస రాజకీయ పరిజ్ఞానం లేని పవన్ తనను తాను ఎక్కువగా ఊహించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబును ఎలాగైనా ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోపెట్టాలని పవన్ తహతహలాడుతున్నారని, అందుకే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వలంటీర్లు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎం.ఇమ్మానియేలు, సొసైటీ చైర్మన్ చుండూరి నాగేశ్వరరావు, సీహెచ్ జ్ఞానారెడ్డి, మిరియాల దిలీప్, గంధం చంటి, వెంపా కృష్ణ,యడ్ల మోహన్, శివరామకృష్ణ , జంగా చెన్నకేశవరెడ్డి, జగ్గవరపు శ్రీహరిరెడ్డి, బి.వెంకమరాజు, ప్రసాద్‌రాజు, జి.రాంబాబు, సొంతి ఖన్నా, జైపాల్, టి కుటుంబరావు, పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

దత్తుడి దిష్టిబొమ్మ దహనం చేసిన వలంటీర్లు

కొయ్యలగూడెం: వలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు, చంద్రబాబుకి దత్తపుత్రుడు అయిన పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్ల లోకం సోమవారం భగ్గుమంది. మండల వ్యాప్తంగా వలంటీర్లు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పొంగుటూరులో సర్పంచ్ పసుపులేటి రాంబాబు, సచివాలయాల మండల కో-ఆర్డినేటర్ సూకల రాము ఆధ్వర్యంలో వలంటీర్లు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను ఊరేగించి మెయిన్ రోడ్డుపై దహనం చేశారు. పవన్ కళ్యాణ్ వలంటీర్లకు క్షమాపణ తెలపాలని లేనిపక్షంలో ఆయన వారాహి యాత్రను అడ్డుకుంటామని వలంటీర్ల అసోసియేషన్ నాయకులు కైకవరపు గోపి, కుక్కల ఫణి హెచ్చరించారు. అదేవిధంగా కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్లో వలంటీర్ల అసోసియేషన్ పవన్ కళ్యాణ్‌పై ఫిర్యాదు చేసింది. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను పోలీస్ శాఖ సుమోటోగా స్వీకరించి ఆయనపై క్రిమినల్ కేసులు పెట్టాలని, వలంటీర్లకు బేషరతు క్షమాపణ తెలపాలని అన్నారు. పవన్ కళ్యాణ్ క్షమాపణ తెలిపే వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సిందిగా వలంటరీ అసోసియేషన్ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు పిలుపు ఇచ్చారు.

వలంటీర్లను విమర్శిస్తే సహించం

కామవరపుకోట : ప్రజలకు సేవ చేసే గ్రామ సచివాలయ వలంటీర్లను విమర్శిస్తే సహించేది లేదని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, వైఎస్సార్ సీపీ మండల టౌన్ కన్వీనర్ నానాది సాగర్ అన్నారు. వలంటీర్లపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మండలంలో గ్రామ సచివాలయాల వలంటీర్లు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు అందజేయడంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పనిచేస్తున్నామని అటువంటి మమ్ములను పవన్ కళ్యాణ్ అనుచితమైన వ్యాఖ్యలు చేస్తూ విమర్శించడం తగదని వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలో కొత్తూరు, కొండగూడెం పలు సచివాలయాల్లో వలంటీర్లు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు హనుమంతరావు, అశోక్, బాబురావు, అనిల్, బుజ్జిబాబు, సుధాసాగర్, నాగలక్ష్మి, గౌతమీ, స్వీటీ, రోజా, దివ్యవాణి, మల్లెల్లి ప్రియదర్శిని, కుదం లిఖిత, వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు

వలంటీర్లను కించపరచడం తగదు

టి.నరసాపురం : ఎటువంటి ఆధారాలు లేకుండా వలంటీర్‌లపై ఆరోపణలు చేసిన పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని టి.నరసాపురం మండల జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా వలంటీర్‌లు ప్రజలకు సేవలు అందిస్తున్నారని, వారి పరిధిలో ఏ ఒక్క ఇంటిని కూడా నిర్లక్ష్యం చేయకుండా కుల, మత, పార్టీలకు అతీతంగా సేవలు అందించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వలంటీర్ల వ్యవస్థ దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శవంతంగా నిర్వహించబడుతోందని అన్నారు. పలు రాష్ట్రాలు సైతం ఈ వ్యవస్థను ఆయా రాష్ట్రాల్లో అమలు చేసే యోచనలో ఇక్కడ అధ్యయనాలు సైతం నిర్వహించారని వివరించారు. ప్రతీ నెలా వృద్ధులకు పింఛన్లు ఇవ్వడం, ఆయా కుటుంబాల్లో అర్హులను గుర్తించి పథకాలకు దరఖాస్తు చేయించి సంక్షేమ లబ్ధి వారికి అందేలా చేయడంతో కీలకపాత్ర పోషిస్తోంది వలంటీర్లే అని వివరించారు. వలంటీర్లను కించపరుస్తూ పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

పవన్.. ఆరోపణలు నిరూపించగలవా

జంగారెడ్డిగూడెం రూరల్ : పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలను నిరూపించాలని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా సవాల్ విసరారు. లక్కవరంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ఏలూరు సభలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతిలో మైకు ఉంది కదా అని నోటికొచ్చినట్లు పవన్ మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలో మహిళలు, యువతుల అదృశ్యంలో వలంటీర్ల పాత్ర ఉందంటూ కేంద్ర నిఘా వర్గాలు పవన్ కల్యాణ్‌కి చెప్పారని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవాస్తవమైన ఆరోపణలను మానుకోకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

లక్కవరంలో...

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరంలో వలంటీర్లు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పవన్ కళ్యాణ్‌కి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. అనునిత్యం ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేకుంటే వలంటీర్ల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్కవరంలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు →



పవన్ కళ్యాణ్ అజ్ఞాని



ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం : వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తీవ్రంగా ఖండించారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం పాలన సాకారం చూస్తూ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. వలంటీర్లను ఏర్పాటు చేసినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు అందించడంలో, ప్రజలకు మెరుగైన సేవలు చేయడంలో వలంటీర్లు ముందజలో ఉన్నారన్నారు. నేడు వలంటీర్ల సేవలను మన దేశంతో పాటు ప్రపంచ దేశాలు కూడా ప్రశంసిస్తున్నాయని తెలిపారు. కరోనా సమయంలో వలంటీర్ల ఎంతో సేవచేసి ఎందరో ప్రాణాలు కాపాడిన సేవకులు వారు అని అన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందేలా కృషి చేస్తున్న వలంటీర్లను నోటికొచ్చినట్లు పవన్ కళ్యాణ్ మాట్లాడడం తగదన్నారు. పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి అజ్ఞాని అన్నారు. లక్ష పుస్తకాలు చదివినట్లు చెప్పుకుంటున్న పవన్‌కళ్యాణ్ ఎటువంటి లాభాన్ని ఆశించకుండా ప్రజలకు సేవసేస్తున్న వారిపట్ల అజ్ఞానిలా మాట్లాడడం బాధాకరం అన్నారు. చంద్రబాబు రాసింది చదివే నువ్వు వలంటీర్ల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. భేషరతుగా వలంటీర్లకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలన్నారు.

మహిళలంటే పవన్‌కు చులకన



ఐసీడీఎస్ రీజనల్ ఛైర్మన్, ఏలూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయి బాల పద్మ

జంగారెడ్డిగూడెం: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు మహిళలంటే ఎంత చులకన భావన ఉందో ఏలూరులో జరిగిన వారాహి యాత్రలో తేటతెల్లమైందని ఐసీడీఎస్ రీజనల్ ఛైర్మన్, ఏలూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయి బాల పద్మ అన్నారు. సోమవారం జంగారెడ్డిగూడెంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థ పట్ల పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆయన రాజకీయ అజ్ఞానాన్ని తెలియజేస్తోందన్నారు. ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్‌ను బట్టీపట్టి అప్పజెప్పుతున్నారే తప్ప, వాటిలో నిజానిజాలను తెలుసుకోవడం లేదన్నారు. దేశానికే తలమానికంగా నిలుస్తున్న వలంటీర్ వ్యవస్థను కించపరిచే విధంగా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. తన ఎజెండా ఏమిటో, తాను ఏమి చేస్తానో చెప్పలేని పవన్ కళ్యాణ్, చంద్రబాబు డైరెక్షన్‌లో పిచ్చిప్రేలాపనలు మాట్లాడుతున్నారని విమర్శించారు. నేడు వలంటీర్ వ్యవస్థలో 70శాతం వరకు మహిళలు పనిచేస్తున్నారని, ఇది గుర్తెరిగి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేయాలన్నారు. తమకు అధికారం దక్కదేమోనన్న అక్కసుతోనే వ్యవస్థలను కించపరుస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే పవన్ కళ్యాణ్ వలంటీర్ వ్యవస్థకు, మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వలంటీర్ వ్యవస్థపై తెలుసుకుని మాట్లాడాలి : పీపీఎస్

ఏమీ తెలియకుండా వలంటీర్ వ్యవస్థ గురించి మాట్లాడటం అన్యాయం అని వైఎస్సార్ సీపీ జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు పీపీఎస్‌చంద్రరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లు అంటే ప్రభుత్వానికి కాదు, ప్రజలకు సేవలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం రూ.5 వేలతో వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనిదన్నారు. కోవిడ్ సమయంలో కుటుంబసభ్యులే దగ్గరకు చేరని స్థితిలో వలంటీర్‌లు బాధితుల వద్దకు వెళ్లి సేవలు అందించారన్నారు. అలాగే అవ్వా తాతలకు 1వ తేదీన పింఛన్‌లు అందించడం, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం వలంటీర్‌ల వ్యవస్థ ద్వారానే సాధ్యమైంది. అటువంటిది ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్‌ను మీరు మాట్లాడటం కాదు, విజ్ఞతతో వ్యవహరించి మాట్లాడటం సరైనది. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని వలంటీర్‌లకు సభా ముఖంగా క్షమాపణలు చెప్పాలన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్ : ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలం ఎల్ఎన్ డీపేట గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకుని కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. ప్రజా సమస్యలను ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. స్థానికులు చెప్పిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా డ్రెయిన్‌లు , మురుగునీటి సమస్య గ్రామస్తులు తెలిపారు. దీంతో సచివాలయానికి నిధులు అందించడం జరుగుతుందని, ఆ నిధులతో మీకు అవసరమైన పనులు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షులు మిడియం సింగరాజు, ఏఎంసీ డైరెక్టర్ దాకే మంగాయమ్మ, పోలవరం సొసైటీ అధ్యక్షులు బండారు అప్పారావు, ఇళ్ల కళ్యాణ్, నార్గాని పోసి, ధూళి బాపిరాజు, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఛాన్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

చింతలపూడి : రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. బాలువారిగూడెం గ్రామంలో సోమవారం సర్పంచ్ యువరాజు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని, చింతలపూడి నుంచి బాలువారిగూడెం వెళ్లే ప్రధాన రహదారిని నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేని కోరారు. అదే విధంగా సీసీ రహదారులు నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన గడపగడపకు కార్యక్రమం దోహదం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డా.బి రాంబాబు నాయక్, సర్పంచ్ కొండుబోయిన యువరాజు, ఎంపీటీసీ మల్లేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, యడ్ల మోహన్‌రావు, ఎం దిలీప్, ఎస్ దుర్గారావు, జంగా చెన్నకేశవరెడ్డి, జగ్గవరపు శ్రీహరిరెడ్డి, ప్రకాష్ , రేచర్ల రాజు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం



ద్వారకాతిరుమల : దొరసానిపాడులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా



పోలవరం రూరల్ : ఎల్ఎన్‌డీపేటలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



చింతలపూడి : ఊటసముద్రం సచివాలయం వద్ద లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ నూరుశాతం మేలు జరుగుతుందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని దొరసానిపాడులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన లబ్ధిదారులకు కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్ లక్కాబత్తుల సిద్ధిరాజు, ఎంపీటీసీ అల్లాడ హరేరామకృష్ణ, మద్దిపాటి సోమేశ్వరరావు, మానుకొండ రాంబాబు, యాచమనేని నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ భాషా, డిజె రాజు, తహసీల్దార్ కె.సతీష్, ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పోలవరం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష ప్రత్యేక కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఎల్ఎన్‌డీపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో జీవీవీ సత్యనారాయణ, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లక్కవరంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తొలుత ఎమ్మెల్యే చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. చెత్త సేకరించే రిక్షాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, ఎంపీటీసీలు దల్లి మోహనరెడ్డి, ప్రత్యేకాధికారి రాము, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, సొసైటీ చైర్మన్ బడి దుర్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి..

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం.ఝాన్సీరాణి అన్నారు. జీలుగుమిల్లి మండలం పి.రాజవరంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 401 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు.

సమస్యల పరిష్కారానికే..

చింతలపూడి : సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. మండలంలోని ఊటసముద్రం గ్రామ సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణ జ్యోతి మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 156 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందచేసినట్లు తెలిపారు.

టి.నరసాపురం : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడుతోందని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. మండలంలోని జగ్గవరంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.